క్లుప్తంగా

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత సూచించారు. చినముషిడివాడ సమీపంలోని అంబేడ్కర్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ పరిసరాల్లో దోమల నియంత్రణకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడడంతో పాటు పరి శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు చెక్ పెట్టవచ్చునన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీష, వార్డు సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

పెందుర్తి: అద్దై కృతికను పురస్కరించుకుని వెంకటాద్రిపై కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామికి పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. కావిడి ఉత్సవం భక్తిశ్రద్ధలతో చేశారు. మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

4న వెన్నలపాలెంలో మెగా రక్తదాన శిబిరం

పరవాడ: ఓనస్ ఫౌండేషన్ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 4న వెన్నలపాలెం మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మెగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరి ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం శిబిరంలో 18 ఏళ్లు దాటిన యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

యువతకు స్ఫూర్తి అయేషా



అయేషాను అభినందిస్తున్న దేవిసాంబ

పెందుర్తి: రష్యాలోని బ్రిక్స్ దేశాల యూత్ సదస్సులో ప్రాతినిధ్యం వహించిన పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన షేక్ అయేషా యువతకు ఆదర్శంగా నిలిచిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత కోడిగుడ్ల దేవిసాంబ అన్నారు. మంగళవారం అయేషాను సరిపల్లిలోని ఆమె నివాసంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన అయేషా దేశం తరఫున ప్రాతినిధ్యం వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆమె మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సరిపల్లి ఉపసర్పంచ్ హేమంత్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సింహాలతో గుబులు!

- పెందుర్తి నియోజకవర్గంలో వీధి కుక్కల స్వైర విహారం
- పీహెచ్‌సీలకు రోజుకు 20–30 మంది కుక్కకాటు బాధితులు





పెందుర్తి, దొగ్గవానిపాలెం ప్రాంతాల్లో తిరుగుతున్న కుక్కలు

పెందుర్తి: పట్టణం, గ్రామీణం అని తేడా లేకుండా శునకాలు అలజడి రేపుతున్నాయి. మనుషుల వెంటపడి గాయాలపాల్జేస్తున్నాయి. గ్రామసింహాల దాడిలో రోజూ పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలవుతున్నారు. గ్రామాలు, కాలనీలు తేడా లేకుండా కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలు మనుషులను వెంటాడి మరీ దాడులకు పాల్పడున్నాయి. కుక్కల నియంత్రణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. నియోజకవర్గం పరిధిలోని ఆస్పత్రులకు నిత్యం 20–30 బాధితులు వస్తుండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. ఒక్క పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే నెల రోజుల వ్యవధిలో 200 వరకు కేసులు నమోదయ్యాయి.

స్వైర విహారం : పెందుర్తి ప్రాంతంలో ముఖ్యంగా జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో రోజురోజుకూ శునక రాజ్యం విస్తరిస్తోంది. దాదాపు ప్రతీ కాలనీలోనూ పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను శివారు ప్రాంతంలో వదిలిపెట్టడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుంది. నగరంలో పట్టుకున్న కుక్కలను జీవీఎంసీ సిబ్బంది పెందుర్తి ప్రాంతంలో విడిచిపెడుతున్నారు. ఇవి పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా పారిశుధ్యకార్మికులు, విద్యార్థులు ఉదయం వేళల్లో కుక్కకాటుకు గురవుతున్నారు. ఇక సాయంత్రం వేళల్లో వాకర్స్, మహిళలపై శునకాలు దాడులకు దిగుతున్నాయి. దీంతోపాటు వాహనాలపై వెళుతున్న వారిని వెంబడించడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లోని ఫౌల్ట్రీ వ్యర్థాలు తిని కుక్కలు జనవాసాల్లోకి వచ్చి దాడులకు దిగుతున్నాయి. దీంతో బాధితులు ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. బయటకు రావడానికి భయపడుతున్నారు.

నియంత్రణ ఏదీ..

వాస్తవానికి జనావాసాల్లో తిరుగుతున్న కుక్కలను చంపే అవకాశం లేదు. అయితే ఇక్కడ తిరుగుతున్న కుక్కలను పట్టుకుని బయటకు తరలించాలి. మరోవైపు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లతో పాటు, కుటుంబ నియంత్రణ చికిత్సలు కూడా చేయాలి. కానీ ఆయా ప్రతిపాదనలు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. నెలలో రెండు సార్లు ప్రత్యేక డ్రైవ్ ద్వారా కుక్కలు పట్టాల్సి ఉండగా అటువంటి చర్యలు శూన్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి పథకానికి రూ.17 లక్షలతో టెండర్లు

- శిథిల భవనం తొలగించడానికి ప్రతిపాదనలు
- లైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



శిథిలావస్థకు చేరిన వెంకటపతిపాలెం వాటర్‌ట్యాంకు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి నగిరెడ్డి రమేష్ తెలిపారు. 'వెంకటపతిపాలెంలో సమస్యల తిష్ట' శీర్షికన ఈ నెల 27న 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రమేష్ స్పందించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు, పైపులైన్ పునర్నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.17 లక్షల జేజేఎం నిధులతో టెండర్లు పిలిచారని త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన సామాజిక భవనాన్ని తొలగించడానికి ఇంజినీరింగ్ అధికారుల ఆమోదం కోసం పంపినట్టు తెలిపారు. వారి నుంచి అనుమతి లభించిన వెంటనే భవనాన్ని తొలగించి ఆ స్థానంలో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామంలో వెలగని వీధి దీపాలను తొలగించి పూర్తి స్థాయిలో లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచేలా బోధన

ఆర్జేడీ విజయభాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేలా బోధన సాగాలని ఆర్జేడీ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,నక్కలవానిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆర్జేడీ విజయభాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నక్కవానిపాలెం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.అనంతరం మండల పరిషత్ సమావేశమందిరంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం,వెనుకబడిన విద్యార్థుల గుర్తింపు,వారిపై ప్రత్యేక శ్రద్ధ, విద్యా ప్రమాణాల పెంపు,విద్యార్థుల్లో నైతిక విలువలు కల్పించడం వంటి వాటిపై ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు లక్ష్మణరావు,బి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ



కొత్త మహాలక్ష్మమ్మ వారిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడులో కొలువైన కొత్త దుర్గా మహాలక్ష్మి అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దంపతులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కోలాటం పోటీలు,తప్పెట గుళ్లు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, నాయకులు ఇందల వెంకటరమణ,పంచకర్ల వెంకటేశ్వరరావు,ప్రసాద్,సాలాపు వెంకటేశ్వరరావు,మీన దంపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకొన్నారు.సబ్బవరం సర్వే నెంబర్ 286లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నించడంతో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో నూకరత్నం మిగిలిన సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

విద్యార్థుల ప్రవర్తనపై దృష్టి పెట్టండి

డీఈవో చంద్రకళ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పురుషోత్తపురం, పులగాలిపాలెం, నరవవాని పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించి విద్యార్థులు చదువుతున్న తీరు, వారి ప్రవర్తనపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు టీచింగ్ నోట్స్ వివరంగా రాయాలని, టీఎల్‌ఎం వాడాలని, ప్రతీ 15 రోజులకు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.సువర్ణ, ఎంఈవో–2 మధుమూర్తి, సహాయ ఎ.ఎం.వో లక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టండి



స్టేషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక



పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

- ప్రమాదాలు తగ్గేలా చర్యలు
- అనకాపల్లి ఎస్పీ దీపిక

పరవాడ: పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగడంతో పాటు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. పరవాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ దీపిక మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలిచారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ద్విచక్ర వాహనాలు ఏఏ కేసుల్లో స్వాధీనం చేసుకున్నారో తెలుసుకున్నారు.

సీజ్ చేసిన వాహనాల వివరాలపై నివేదిక అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశ్రామిక ప్రాంతంలో జరిగే ప్రమాదాలపై సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందే విధంగా పోలీసులు తమ వంతు కృషి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు.

గంజాయి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని సిబ్బందికి ఎస్పీ దీపిక తగు సూచనలు చేశారు. అలాగే సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్‌ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ

ఆల్ వెలమ సంక్షేమ సంఘం తీర్మానం

దాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు. వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా వెలమలంతా ఐకమత్యంతో ఒక్కటై పయణించాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆల్ వెలమ సమన్వయకర్త అల్లు శంకరరావు, గూనూరు వెంకట రమేష్, సిరికి పోతురాజు, సింగంపల్లి రామారావు, కింజరాపు సూర్యనారాయణ, మరడాన శేష గిరిరావు, రంభ బుజ్జి, జి.లక్ష్మణ, గునుపూరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హోమియో వైద్యాధికారి అరుణప్రకాష్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహాచల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అడవివరం హోమియో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అరుణప్రకాష్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఏవిధంగా వ్యాప్తి చెందుతాయో, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తిచెందకుండా దోమ తెరలు వాడాలని, ఇటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు హోమియో మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు, కేజీహెచ్ నర్సింగ్ విద్యార్థులు, యోగా మాస్టర్ బాలభాను, వైద్య సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవాలని వినతి



తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబేడ్కర్ సేవా సమితి ప్రతినిధులు

పెందుర్తి: ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం సహకారం అందించాలని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సేవా సమితి కార్యవర్గ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చందోలు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు బోనెల జోసెఫ్, ఉపాధ్యక్షులు బొండపల్లి సత్యం, గొల్ల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోట సుబ్బారాయుడు, సంయుక్త కార్యదర్శి కాకర నూకరాజు, మువ్వల రమణ, సీహెచ్ రమణేంద్ర పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న లక్ష్మి

పెందుర్తి: గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో ఉన్న పిల్లలు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని కుశాల్ ప్రాజెక్ట్ ప్రతినిధి కె.లక్ష్మి అన్నారు. వేపగుంట ముత్యమాంబ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా పలు వ్యాధుల ముప్పు తప్పించుకోవచ్చని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : చిన్నారులు, మహిళల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. వారి రక్షణకు ఉద్దేశించిన చట్టాలు సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ఉదయం జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టంపై ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నారుల అక్రమ రవాణా, మాయం కావడం వంటి కేసులు సమాజాన్ని కలవరపెడుతున్నాయన్నారు. అదేవిధంగా యాసిడ్ దాడులకు గురైన మహిళల రక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు సమర్థంగా అమలు పరచాలని కోరారు. అందరూ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సి.కె.గాయత్రి దేవి, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు.

పక్కాగా ఉచిత ఇసుక పంపిణీ

డిపో సిబ్బందికి జేసీ మయూర్ అశోక్ ఆదేశం

మహారాణిపేట: జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలుకావాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టి, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు డీఈవీఎస్ ఎస్ఎన్.రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలకు ప్రోత్సాహం

మహారాణిపేట: రైతు ఉత్పత్తిదారు సంఘాల (ఎఫ్‌పీవో–ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని, ప్రొడక్ట్స్‌కు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల తాలూకా ఫలాలను రైతులకు చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎఫ్‌పీవో డిస్ట్రిక్ట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా రైతు ఉత్పత్తిదారు సంఘాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, ఎల్డీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఉత్పత్తిదారు సంఘాలకు చెందిన ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

4న భువనేశ్వరీ దేవికి అధివాస మహోత్సవం

దాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా సబ్బవరం మండలం యాతపాలెం గ్రామంలో వెలసిన భువనేశ్వరీ దేవికి ఆగస్టు 4న అధివాస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు భువనేశ్వరీ పీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. అమ్మవారికి పూజలు నిర్వహించే భక్తులు చీర, జాకెట్టు, కుంకుమ తదితర పూజా సామగ్రితో విచ్చేసి పూజలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.